సాక్షి
నంద్యాల
సోమవారం । 11 । నవంబర్ । 2024



శ్రీ మఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి పూజలు నిర్వహించుకున్నారు.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై ఆదివారం తెనాలికి చెందిన లాస్య కూచిపూడి నాట్యాలయం వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1.633
ప్రస్తుతం	:1.631.86
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.226
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:7.264
అవుట్ ఫ్లో	:10.069

న్యూస్‌రీల్

అన్నదాన పథకానికి రూ.2లక్షల విరాళాలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం గుంటూరుకు చెందిన పసుపులేటి నాగరాజు రూ.1,00,116, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎం.వసంతలక్ష్మి రూ.1,00,116 చొప్పున విరాళాన్ని ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి జి.స్వాములకు అందజేశారు. దాతలకు దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికలు అందించి సత్కరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం

నంద్యాల: పట్టణంలోని కలెక్టరేట్ సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరగనుంది. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

శ్రీశైలానికి 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి ఆదివారం సాయంత్రం జూరాల, సుంకేసుల నుంచి 9,885 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. శనివారం నుంచి శుక్రవారం వరకు ఎగువప్రాజెక్టుల నుంచి 3,681 క్యూసెక్కుల నీరు వచ్చింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 41,541 క్యూసెక్కుల నీరు విడుదలైంది. కుడిగట్టు కేంద్రంలో 4.496 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 7.637 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 173.8786 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 877.10 అడుగులకు చేరుకుంది.

మచిలీపట్నం- ధర్మవరం రైలు పొడగింపు

కోవెలకుంట్ల: నంద్యాల-ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో నడుస్తున్న మచిలీపట్నం- ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలును బెంగళూరు వరకు నడిపేందుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. ఈ మార్గంలో ప్రతి రోజు రాత్రి ధర్మవరం నుంచి వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, నంద్యాల జిల్లా కోవెలకుంట్ల, బనగానపల్లె, నంద్యాల మీదుగా మచిలీపట్నం వరకు నడుస్తోంది. మచిలీపట్నం నుంచి మరో రైలు ప్రతి రోజు ఇదే మార్గంలో ధర్మవరం చేరుకుంటోంది. ఈ రైలు ధర్మవరం చేరుకున్న తర్వాత దాదాపు 7.40 గంటలపాటు రైల్వే ట్రాక్‌పై ఉండటం వల్ల వివిధ రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని దక్షిణ మధ్య రేల్వేశాఖ కేంద్ర రైల్వే శాఖను కోరింది. ఈ నేపథ్యంలో రైలును ధర్మవరం నుంచి బెంగళూరు లేదా యశ్వంత్‌పూర్ వరకు నడిపేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. అతి త్వరలో నంద్యాల- ఎర్రగుంట్ల మార్గంలో నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు బెంగళూరు వరకు నడవనుండటంతో రెండు రాష్ట్రాల ప్రయాణికులకు రాకపోకలు సులభతరం కానున్నాయి.

డ్యూటీ దయనీయం!

వెంకటేశ్వర్లు (పేరు మార్చాం) వయస్సు 50 ఏళ్లు. ఆళ్లగడ్డలో హోంగార్డుగా పనిచేసే ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులతో పాటు దివ్యాంగురాలైన కూతురును చూసుకుంటూ అక్కడే పిల్లలను చదివించుకుంటున్నాడు. ఒక్క రోజు సెలవు పెట్టినా జీతం కోత పడుతుంది. దీంతో పండగ వచ్చినా.. తీవ్ర మైన జ్వరం వచ్చినా సెలవు పెట్టకుండా విధులు నిర్వహిస్తున్నాడు. అలాంటి వ్యక్తిని క్యూఆర్‌టీ (క్విక్ రియాక్షన్ టీం)కు కేటాయిస్తూ అధికారులు ఉత్తర్వులు అందించడంతో పాటు నెలరోజులు దాటినా రిలీవ్ చేయకపోవడంతో కృంగిపోతున్నాడు. సబ్‌డివిజన్ పరిధిలో ఎక్కడ అవసరమైతే అక్కడకు తిప్పుతుండటంతో రోజువారి వేతనం రూ. 700 లో బైకు పెట్రోల్‌కు, టిఫిన్, భోజనం, ఇతర ఖర్చులకు రోజు రూ. 500 పైగా ఖర్చవుతుందని కుమిలి పోతున్నాడు. జిల్లాలోని నాలుగు పోలీస్ సబ్‌డివిజన్ల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యూఆర్‌టీలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులందరిదీ ఇదే పరిస్థితి.



క్యూఆర్‌టీ విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు

- క్యూఆర్‌టీ విధులతో హోంగార్డుల అవస్థలు
- సబ్ డివిజన్‌లో ఎక్కడ అవసరమైతే అక్కడకు తిప్పుతున్న అధికారులు
- రాకపోకలు, వసతి, భోజన సౌకర్యాలకు సరిపోతున్న జీతం
- సమయాపాలన లేకుండా చాకిరీ
- అధికార పార్టీ అండ ఉన్న వారికి ఆదాయం వచ్చే డ్యూటీలు

ఆళ్లగడ్డ: జిల్లాలో 590 మంది హోంగార్డులున్నారు. పోలీసులతో పాటు సమానంగానే పనిచేసే వీరికి సరైన గుర్తింపు, ప్రోత్సాహం ఉండటం లేదు. దీనికితోడు అధికారులు సూటిపోటి మాటలు.. వేధింపులు. ఇవన్నీ భరిస్తూ అరకొరవేతనాలతో పని చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నా హోంగార్డుల్లో కొందరికి క్యూఆర్‌టీకి కేటాయించడంతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

సమయపాలన లేకుండా చాకిరీ

జిల్లాలో నాలుగు పోలీస్ సబ్‌డివిజన్‌లు ఉన్నాయి. ఆయా సబ్‌డివిజన్‌ల పరిధిలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, హోంగార్డులతో కలిపి నెల రోజుల క్రితం క్యూఆర్‌టీలు ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో 11 మంది చొప్పున నాలుగు సబ్‌డివిజన్‌లలో నాలుగు క్విక్ రియాక్షన్ టీంలు ఏర్పాటు చేశారు. ఈ టీంలు ఆయా డీఎస్పీల ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ పరిధిలో ఎక్కడ అవసరమో అక్కడకు వెళ్లి విధులు నిర్వహించాలి. అయితే ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన రోజుకు 8 గంటల డ్యూటీ నిబంధనలు పక్కన పెట్టి సమయాపాలన లేకుండా 24 గంటలు వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని హోంగార్డులు వాపోతున్నారు.

అధికార పార్టీ అండ ఉంటే..

హోంగార్డుల డ్యూటీల విషయంలో కూడా రాజకీయ పెత్తనం ఉండటం కలవరం రేపుతోంది. టీడీపీ నాయకుల సిఫార్సు ఉన్న వారికి హైవే వాహనం, అధికారుల డ్రైవర్లు మైనింగ్, ఆర్టీవో దేవస్థానాలు, ట్రాఫిక్ తదితర ఆదాయం వచ్చే డ్యూటీలు వేస్తున్నట్లు సమాచారం. ఎటువంటి సిఫార్సులు గానీ అధికార పార్టీ నేతల అండగాని లేని హోంగార్డులకు మాత్రం అక్కడికి ఇక్కడికి తిప్పుతూ వేధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేతనమంతా డ్యూటీకే ఖర్చు

హోంగార్డులు విధులు నిర్వహిస్తే రోజుకు రూ. 700 చొప్పున వస్తుంది. సహచర పోలీసుల్లాగా వీరికి ఎటువంటి టీఏ, డీఏలు ఉండవు. ఏ ఒక్కరోజు గైర్హాజరైనా ఆ రోజు వేతనం ఉండదు. ప్రస్తుతం క్యూఆర్ టీలో జిల్లాలోని మారు మూల ప్రాంతాలు జిల్లా సరిహద్దుల్లో సుమారు 100 కి.మీ దూరంలో ఉన్న ప్రాంతల్లో సైతం రాత్రి పగలు అన్న తేడా లేకుండా అప్పటికప్పుడు డ్యూటీలు వేస్తున్నారు. అక్కడికి వెళ్లేందుకు వాహనం సౌకర్యం కల్పించక పోవడంతో సొంత బైకులపై చేరుకోవల్సి వస్తోంది. దీంతో వచ్చే జీతంలో పెట్రోల్ తిండి, ఇతర ఖర్చు కోసం సుమారు రూ. 500 నుంచి రూ. 600 వరకు ఖర్చు అవుతోందని మనోవేదనకు గురవుతున్నారు. ఒకవేళ ఎక్కడా డ్యూటీ లేక పోయినా 24 గంటలు డీఎస్పీకి గానీ సీఐలకు గానీ అందుబాటులో ఉండాలే తప్ప ఇంటికి పోయే అవకాశం ఇవ్వడం లేదు.

ప్రమాదాలకు ఆస్కారం

సుదూర ప్రాంతాల్లో కాపురం ఉంటున్న క్యూఆర్‌టీ సభ్యులకు అధికారులు అత్యవసరంగా విధులకు వెళ్లాలని అప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తుంటారు. దీంతో సదరు అధికారి చేరుకునేలోపు అక్కడకు చేరుకోవాలంటే అతి వేగంగా బైక్ పై వెళ్తు హోంగార్డులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. వేళకాని వేళల్లో సుదూరం నుంచి డ్యూటీకి రావడం, డ్యూటీ ముగించుకుని తిరిగి వెళ్లడం ఇబ్బందిగా మారిందని హోంగార్డులు వాపోతున్నారు.

నెలకోసారి డ్యూటీలు మార్చాలి

నెలల తరబడి మాకు ఈ డ్యూటీలు వేయడంతో స్టేషన్లలో డ్యూటీలు చేస్తున్న సహచర హోంగార్డులు మీకు పనిష్మెంట్ కింద క్యూఆర్‌టీ డ్యూటీలు వేశారు. అందుకే రిలీవ్ చేయడంలేదని హేళనగా మాట్లాడుతున్నారు. కనీసం నెలకోసారైన మమ్మలను స్టేషన్‌కు పంపించి స్టేషన్లో ఉన్నవారిని క్యూఆర్‌టీంకు పంపిస్తే సరిపోతుంది

– హోంగార్డు, ఆత్మకూరు

ఆరోగ్యం బాగాలేదని చెబుతున్నా వినడం లేదు

45 సంవత్సరాలు పైబడ్డ వారికి ప్రత్యేక బలగాల డ్యూటీ వేయకూడదని నిబంధనలు ఉన్నాయి. యువకులు అనేక మంది ఉన్నా వారిని వదిలిపెట్టి 45 నుంచి 50 సంవ్సరాల వారినే ఈ డ్యూటీకి వేశారు. నాకు ఆరోగ్యం బాగాలేదు. రోజు విడిచి రోజు ఆసుపత్రికి వెళ్లాలి ఈ విషయం చెబుతున్నా వినడంలేదు.

– హోంగార్డు, డోన్

సంబంధిత సీఐలు చూసుకుంటారు



అత్యవసర పరిస్థితుల్లో వాహన తనిఖీలు, కార్డన్ సెర్చ్‌లతో పాటు అక్రమ మద్యం, పేకాట స్థావారాలపై దాడులు చేసి నిలువరించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు జిల్లా వ్యాప్తంగా క్యూఆర్‌టీలు ఏర్పాటు చేశాం. ఈ టీంలో 11 మంది ఉంటారు. వీరంతా సబ్‌డివిజన్ పరిధిలో సంబంధిత సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో ప్రత్యేక విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో రోజుకు ఇద్దరికి ఆఫ్ ఉంటుంది. 9 మంది నిరంతరం డ్యూటీలో ఉంటారు. ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం ఏర్పాటు చేస్తాం. ఇతర సౌకర్యాలు ఆయా సీఐలు చూసుకుంటారు.

– రవి కుమార్, ఆళ్లగడ్డ డీఎస్పీ

శుభ ముహూర్తాలు వచ్చేశాయి!

- ఈనెల 13 నుంచి ప్రారంభంకానున్న పెళ్లిళ్లు
- ఒకటి కానున్న వందలాది జంటలు
- ఇప్పటికే బుక్ అయిన మండపాలు





ప్రత్యేకంగా అలంకరించిన వివాహవేదిక

గోస్పాడు: శుభ ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. గత మూడునెలలుగా మూఢాలతో శుభకార్యాలకు అడ్డుకట్ట పడింది. ఈ రెండు నెలలు మంచి ముహూర్తాలుండటంతో జిల్లాలో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరుగనున్నాయి. దాదాపు 15 వందల జంటలు ఒకటి కానున్నాయి. వివాహ వేడుక ప్రతి ఒక్కరి జీవితంలో ఓ మధురానుభూతి. అందుకే అందరూ మెచ్చుకునేలా, పది కాలాలు గుర్తుండిపోయేలా వైభవంగా జరుపుకోవాలని భావిస్తారు. అందుకు తగ్గట్టే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జిల్లాలో వంద వరకు కల్యాణ మండపాలు ఉన్నాయి. అవన్నీ ఇప్పటికే బుకింగ్ అయ్యాయి. జనవరిలో సంక్రాంతి పండుగ ఉండటంతో ఆ నెలలో ముహూర్తాలు ఉండవు. దీంతో ప్రస్తుతం పట్టణం, పల్లె అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా పెళ్లిబాజాలు మోగుతున్నాయి.

వీరంతా బిజీ...

పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో మంగళవాయిద్యాలు, ట్రావెల్స్, పూల అలంకరణ, షామియానాలు, ఫొటోగ్రాఫర్లు, బ్యూటీషియన్లు, వంటల నిర్వాహకులు, ఆర్కెస్ట్రా, పురోహితులు, ఈవెంట్ మేనేజర్లకు చేతి నిండా పని దొరుకుతుంది. పెళ్లంటే ప్రత్యేకంగా కనిపించాలని అంతా భావిస్తుంటారు. దీంతో వధూవరులతో పాటు వారి కుటుంబీకులు, బంధువులు షాపింగ్ పనుల్లో బిజీ అయ్యారు. పూల దుకాణాలు కళకళలాడుతున్నాయి. మల్లె, బంతి. చామంతి, గులాబీ, పూల దండలను వ్యాపారులు విభిన్నంగా తయారుచేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నారు.

పెళ్లి ముహూర్తాలు ఇలా..

నవంబర్ నెలలో ..
13, 14, 16, 17, 20, 22, 27, 28తేదీలు
డిసెంబర్ నెలలో..
4, 5, 6, 7, 8, 11, 12, 14, 15, 20, 21, 26, 27, 28 తేదీలు

ముహూర్తాలు మొదలయ్యాయి



వచ్చే మార్చి వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ కాలంలో అధిక సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే వధూవరులు, బంధువులు వివాహాలకు ముహూర్తాలను ఖరారు చేసుకుంటున్నారు. కల్యాణ మండపాల నుంచి స్వాగత తోరణాల వరకు నచ్చిన రీతిలో డెకరేషన్ చేస్తున్నాం.

– సుధీంద్రాచార్యులు, జిల్లా అఖిల భారతీయ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, నంద్యాల



మల్లన్న దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

హరోంహర!

- మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివ నామస్మరణ
- భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేసిన దేవస్థానం



పాతాళగంగలో దీపారాధన చేస్తున్న భక్తురాలు



శ్రీశైలంటెంపుల్: భక్తుల శివనామస్మరణతో శ్రీశైల మహా క్షేత్రం మార్మోగుతోంది. కార్తీక మాసం రెండో ఆదివారాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, కార్తీక దీపాలు వెలిగించి స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులుతీరారు. భక్తుల రద్దీతో ఆలయ ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు పూర్తిగా నిండిపోయాయి. క్యూకంపార్ట్‌మెంట్లలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం సిబ్బంది మంచినీరు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు గర్భాలయ, సామూహిక అభిషేకాలను రద్దు చేశారు. కార్తీక దీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్ద, ఉత్తర మాఢవీధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు లక్షదీపోత్సవం.. పుష్కరిణి హారతి

కార్తీకమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని నేటి సాయంత్రం ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణికి దశ విధ హారతులు ఇస్తారు. ఆలయ పుష్కరిణి మొత్తం లక్ష దీపాలు ఏర్పాటు చేయనున్నారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని దేవస్థాన అధికారులు కోరారు.

ప్రశ్నించే గళాలకు సంకెళ్లు!

- భావప్రకటన స్వేచ్ఛను కాలరాస్తున్న సర్కారు
- అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్న వైనం
- సోషల్‌మీడియా యాక్టివిస్టులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కక్ష సాధింపు చర్యలు
- ప్రభుత్వ తీరు మారాలంటున్న వామపక్షాలు, శ్రామిక, విద్యార్థి సంఘాల నాయకులు



నంద్యాల: ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ గళాన్ని స్వేచ్ఛగా వినిపించొచ్చు. ఇది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు. అయితే, ఈ హక్కును కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. గళమెత్తిన వారిని అరెస్టులు చేసి సంకెళ్లు వేస్తోంది. పత్రికల్లో ప్రచురితమైన ప్రభుత్వ వ్యతిరేక కథనాలను సోషల్‌మీడియాలో పోస్టు చేశాడని మహానంది మండలం బొల్లవరానికి చెందిన జగన్‌కృష్ణపై ఇటీవల కేసు పెట్టి అరెస్టు చేశారు. ఇలా ఎవరైనా సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభుత్వ తప్పిదాలను, నేతలు చేస్తున్న అవినీతి అక్రమాలను నిలదీస్తే కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుంది. ప్రశ్నించే గొంతు నులిమి వేయాలన్న దుర్మార్గపు ఆలోచనతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తుంది. ఈ కక్షసాధింపు చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, భావ ప్రకటన స్వేచ్ఛను హరించే హక్కు ప్రభుత్వానికి లేదని మేధావులు, విద్యావంతులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం



కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసింది. అనవసరమైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటు. వ్యక్తిగత విషయాలపై సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టులు చేస్తే చర్యలు తీసుకోవాల్సిందే. అయితే, ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే కేసులు నమోదు చేయడం సరికాదు.

–దాల్‌మిల్ అమీర్‌బాషా, ఐహెచ్‌ఆర్‌పీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నంద్యాల

ప్రజాగ్రహం తప్పదు



సోషల్ మీడియా నోరు నొక్కి ప్రభుత్వం తనమీద తానే మట్టి వేసుకుంటోంది. ఇలా వ్యవహరిస్తే ప్రజాగ్రహం తప్పదు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత దారుణంగా వ్యవహరించలేదు. సమస్యలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే అరెస్టులు చేస్తారా..? టీడీపీ ప్రభుత్వ వ్యవహార శైలి దారుణంగా ఉంది. నిరంకుశ పాలనను తలపిస్తోంది. ప్రతిపక్షాల నోరు నొక్కి తాము చెప్పిందే శాసనం అంటూ హుకుం జారీ చేయడం ప్రజాస్వామ్యాన్ని కించపరచడమే అవుతుంది.

–సాయిరాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, నంద్యాల

కేసులపై ఉన్న శ్రద్ధ హామీల అమలుపై లేదేం



ప్రజలకు వివిధ హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వాటి అమలుపై శ్రద్ధ పెట్టకుండా, ప్రశ్నించేవారిపై కేసులు పెట్టడం సరికాదు. ప్రజావసరాలతో పాటు, సమస్యలు ప్రభుత్వానికి ఏకరువు పెట్టడానికి సోషల్ మీడియాను ప్రతి వ్యక్తి వినియోగిస్తున్నారు. ఇందులో ఏదో తప్పు జరిగినట్లు తమ ప్రభుత్వానికి భంగం కలిగినట్లు వ్యవహరించి కేసులు పెట్టి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం దారుణం. ప్రతి వ్యక్తి సర్కారు తీరును ఖండించాల్సిన అవసరం ఉంది.

–శంకర్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి, నంద్యాల

ఇది మంచిపద్ధతి కాదు



సోషల్ మీడియా యాక్టివిస్టులపై ప్రభుత్వం, పోలీసులు తీసుకుంటున్న చర్యలు పద్ధతిగా లేవు. కేవలం కక్షసాధింపు చర్యలా ఉంది. ఓ విషయం నచ్చకపోతే దాన్ని ధైర్యంగా చెప్పడం, నిరసన తెలియజేసే హక్కు రాజ్యాంగం కల్పించింది. తప్పుడు పనులు చేస్తే చట్టరీత్యా వెళ్లండి. అంతేగాని ప్రశ్నించేవారందరిపై కేసులు పెడతామంటే ఎలా? ఎవరి కోసం ఇదంతా రేపు రోడ్లపైకి వచ్చి నిరసన చేస్తే కూడా ఇలాగే కేసులు పెట్టి వేధిస్తారా?

–రంగనాయకుడు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, నంద్యాల

అటవీ సంపదను సంరక్షించుకోవాలి



అటవీ అమరుల స్థూపంపై పూలమాల ఉంచి నివాళులర్పిస్తున్న ఎఫ్‌టీ డీడీ

ఆత్మకూరురూరల్: అటవీ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆత్మకూరు డివిజన్ ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా అన్నారు. రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉద్యోగులతో కలిసి బైర్లూటీలో అమరుల స్థూపంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల, అటవీ ప్రాంత సంరక్షణ కోసం ప్రాణాలర్పించిన ఎఫ్ఆర్వో రామయ్య చిరస్మరణీయులని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో అటవీ సిబ్బంది తమను తాము కాపాడుకుంటూ అటవీ పరిరక్షణకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓలు పట్టాభి, దొరస్వామి, కృష్ణప్రసాద్, పీఎం ఖాన్, అటవీ డివిజన్ సిబ్బంది, అసోసియేషన్ సభ్యులు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసిన దృశ్యం

ఆస్పరి: మండలంలోని జొహరాపురం గ్రామంలో ఆదివారం కర్నూలు విజిలెన్స్ అధికారులు రామకృష్ణ, విశ్వనాథ్, ప్రవీణ్‌కుమార్ దాడులు చేసి అక్రమంగా తరలిస్తున్న 64 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. బియ్యంను తరలిస్తున్న రెండు బొలెరోలను సీజ్ చేసినట్లు ఆస్పరి సీఐ మస్తాన్‌వలి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జొహరాపురం గ్రామంలో కాశీపతి రేకుల షెడ్డులో ఉన్న 64 క్వింటాళ్ల బియ్యాన్ని రెండు బొలేరో వాహనాలలో డ్రైవర్లు ఆకాష్, బాబు తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఇందులో భాగస్వాములుగా ఉన్న రాము, రాఘవరెడ్డి, కాశీపతి, డ్రైవర్లు ఆకాష్, బాబుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

రుద్రవరం: మండల పరిధిలోని ముత్తలూరుకు చెందిన వెంకటసుబ్బమ్మ (64) ఆదివారం విషపు పొడి నీటిలో కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఒంటరి తనంతో జీవితంపై విరక్తి చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్నప్పటికీ అందరూ వ్యవసాయ పనులకు వెళ్తుండటంతో ఇంటి వద్ద ఒంటరిగా ఉండాల్సి వస్తోంది. మాటామంతి లేకుండా ఒంటరిగా ఉండటం జీర్ణించుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితురాలు

మిడుతూరు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. సుంకేసుల గ్రామానికి చెందిన మాధవి కుటుంబ కలహాల కారణంగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు మిడుతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆకస్మిక మృతి



మాల మునిస్వామి (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడిమెట్ల గ్రామానికి చెందిన మాల మునిస్వామి (26) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన మాల మారెప్ప చిన్న కుమారుడు మునిస్వామి 8 నెలల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. మూడు రోజుల క్రితం భార్య గాయత్రిని హైదరాబాద్‌లోని అత్తమామల వద్ద వదలిపెట్టి ఊరికి వచ్చాడు. ఆదివారం ఉదయం గుండెపోటు రావటంతో చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. నెల రోజుల క్రితం భార్య గాయత్రి మగబిడ్డకు జన్మనిచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త చనిపోయిన విషయం తెలుసుకొని హైదరాబాద్ నుంచి భార్య గాయత్రి కడిమెట్లకు చేరుకుంది. యువకుడి ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సెపక్‌తక్రా విజేత పశ్చిమగోదావరి

- బాలికల విజేత కృష్ణా జట్టు
- ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు
- విజేతలకు ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్ల ప్రదానం
- జాతీయస్థాయి బాలబాలికల జట్ల ప్రకటన



బాలుర విజేత, బాలికల రన్నరప్ పశ్చిమగోదావరి జట్లకు ట్రోఫీలు అందిస్తున్న అతిథులు



బాలికల విజేత, బాలుర రన్నరప్ కృష్ణా జిల్లా జట్లకు ట్రోఫీలను అందిస్తున్న నిర్వాహకులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడలలో భాగంగా ఆదివారం రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు రసవత్తరంగా సాగాయి. 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సెపక్‌తక్రా అండర్ – 17 బాలబాలికల పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆధ్వర్యంలో సభ్యులు నిర్వహించగా, ప్రిన్సిపాల్ బాలరాముడు అధ్యక్షత వహించారు. ఆదివారం నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిథిగా మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ యమున హాజరై ప్రిన్సిపాల్‌తో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి అభినందనలు తెలిపారు.

హోరాహోరీగా తలపడిన క్రీడాకారులు

స్థానిక గురుకుల పాఠశాలలో రెండవ రోజు సెపక్‌తక్రా అండర్ – 17 బాలబాలికల ఎస్‌జీఎఫ్ పోటీలు రసవత్తరంగా సాగాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అనంతపురం, కృష్ణా జిల్లాల జట్లు సెమీఫైనల్ చేరిన విషయం విదితమే. ఆదివారం బాలికల మొదటి సెమీఫైనల్లో పశ్చిమగోదావరి, అనంతపురం జట్లు తలపడగా పశ్చిమ గోదావరి జట్టు విజయం సాధించి ఫైనల్‌కు వెళ్లింది. అదేవిధంగా రెండో సెమీఫైనల్లో తూర్పు గోదావరి జట్టుపై కృష్ణా జిల్లా విజయంతో ఫైనల్‌కు రెండవ జట్టుగా చేరింది. అనంతరం జరిగిన బాలికల ఫైనల్ పోటీల్లో పశ్చిమ గోదావరి జట్టుపై 2–0 సెట్ల తేడాతో కృష్ణా జిల్లా జట్టు ఘనవిజయం సాధించి రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది. రన్నరప్‌గా పశ్చిమగోదావరి జట్టు, మూడో స్థానంలో అనంతపురం జిల్లా జట్టు నిలిచాయి. కాగా శనివారం ఫైనల్‌కు చేరిన పశ్చిమ గోదావరి, కృష్ణ జిల్లా బాలుర జట్లు ఆదివారం హోరాహోరీగా తలపడ్డాయి. చివరకు కృష్ణా జిల్లా జట్టుపై 2–0 సెట్ల తేడాతో పశ్చిమ గోదావరి జట్టు ఘన విజయం సాధించి విజేతగా నిలిచింది. రన్నరప్‌గా కృష్ణా జిల్లా జట్టు, మూడోస్థానంలో అనంతపురం జిల్లా జట్టు నిలిచాయి.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

పోటీల అనంతరం.. వివిధ జిల్లాల జట్ల తరపున పాల్గొని ప్రతిభ చాటిన బాలబాలికలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు ఆంధ్రప్రదేశ్ అండర్ – 17 సెపక్‌తక్రా బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

బాలుర జట్టు ఇదీ..

రాష్ట్ర బాలుర జట్టుకు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎం.సతీష్, జీ.సతీష్, కృష్ణా జిల్లా ఆటగాడు కుషాల్, అనంతపురానికి చెందిన మహ్మద్‌షాహిద్, మోసేస్, విశాఖపట్నంకు చెందిన జశ్వంత్, కృష్ణాకు చెందిన వంశీ, నెల్లూరుకు చెందిన జశ్వంత్ ఎంపికయ్యారు.

బాలికల జట్టు ఇదీ..

అదేవిధంగా బాలికల రాష్ట్ర జట్టుకు కృష్ణ జిల్లాకు చెందిన హరిప్రియ, వెంకటలక్ష్మి, పశ్చిమ గోదావరి జట్టు నుంచి మాధురి, అనంతపురానికి చెందిన తేజ, తూర్పు గోదావరికి చెందిన రమ్య, పశ్చిమ గోదావరికి చెందిన గీతిక, కృష్ణ జిల్లాకు చెందిన ఖాతీబేగం, అనంతపురానికి చెందిన పవిత్ర ఎంపికయ్యారు. ఈ జట్లలో ఐదుగురు మెయిన్ క్రీడాకారులు కాగా మరో ముగ్గురిని స్టాండ్‌బైగా ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెపక్‌తక్రా రాష్ట్ర పరిశీలకులు రమేష్ తెలిపారు. జాతీయ జట్ల ఎంపికతో సి.బెళగల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ – 17 ఎస్‌జీఎఫ్ సెపక్‌తక్రా పోటీలు ముగిసినట్లు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, అసిస్టెంట్ కార్యదర్శులు సుంకారావు, పరమేష్, పోటీల నిర్వహణ కార్యదర్శి, పీడీ రాఘవేంద్ర తెలిపారు. విజేతలకు, జాతీయ పోటీల ఎంపిక క్రీడాకారులకు పోటీల అధ్యక్షులు, ముఖ్యఅతిథులు, నిర్వాహకులు మెడల్స్, సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందజేసి అభినందనలు తెలిపారు.

కన్నకొడుకే కాలయముడు

- తండ్రి హత్యకేసులో లొంగిపోయిన కుమారుడు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

చిప్పగిరి: వృద్ధుడి హత్యకేసులో సొంత కుమారుడే ఈ దారుణానికి పాల్పడినట్లు వెలుగుచూసింది. కేసు విచారణలో ఉండగా ఆదివారం నిందితుడు స్వచ్ఛందంగా లొంగిపోవడంతో ఆస్తి కోసమే హత్య చేసినట్లు తెలిసింది. ఘటనపై డీఎస్పీ వెంకటరామయ్య తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన కురువ కారుమంచప్ప (62) సెప్టెంబర్ 12న రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో మృతుడి పెద్ద కుమారుడు కురువ శ్రీనివాసులు తానే హత్య చేసినట్లు స్వచ్ఛందంగా లొంగిపోయాడు. హత్య చేయడానికి గల కారణాలను వివరిస్తూ బెల్డోణ గ్రామ వీఆర్‌ఓ వద్ద వాగ్మూలం ఇచ్చాడు. వృద్ధుడు కారుమంచప్పకు భార్య రేణుకమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఆ కుటుంబానికి ఉన్న 20 ఎకరాల పొలంలో చిన్నకొడుకు ప్రసాద్‌కు 4.20 ఎకరాలు, పెద్ద కొడుకు కురువ శ్రీనివాసులుకు 4.26 ఎకరాల పొలాన్ని పంచి ఇచ్చాడు. మిగతాది భార్య కూతుర్ల జీవనాధారంగా నిర్ణయించి తన వద్దే ఉంచుకున్నాడు. ఆ పొలంలో కూడా వాటా ఇవ్వాలని శ్రీనివాసులు పలుమార్లు అడిగినా తండ్రి వినలేదు. ఈ స్థితిలో తండ్రిని చంపితే ఆస్తిలో వాటా వస్తుందనే దురాశతో పథకం ప్రకారం హత్య చేసి నట్లు చెప్పాడు. వాంగ్మూలం నమోదుచేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ శ్రీనివాస్‌నాయక్, ఎస్‌ఐ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురి దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్‌లు





మృతులు బజారప్ప, ఇర్ఫాన్ (ఫైల్)

నందవరం: మండల పరిధిలోని ధర్మపురం గ్రామ సమీపంలోని 167వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇర్ఫాన్ (23), డానియల్ అలియాస్ బజారప్ప (19), వంశీ (20) దుర్మరణం చెందారు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలు ఇవీ.. ఎమ్మిగనూరు టౌన్‌కు చెందిన ఇర్ఫాన్ బైక్‌పై మంత్రాలయం వైపు బయలుదేరాడు. అలాగే పెద్దకడుబూరు మండలం కంబాలదిన్ని గ్రామానికి చెందిన బజారప్ప, జలవాడి గ్రామానికి చెందిన వంశీ ఒకే బైక్‌పై మంత్రాలయం వైపు నుంచి ఎమ్మిగనూరుకు బయలుదేరారు. నందవరం మండలంలోని ధర్మపురం గ్రామ సమీపంలోని గుర్రం బొమ్మ వద్ద 167వ జాతీయ రహదారిపై రెండు బైక్‌లు అతి వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇర్ఫాన్, బజారప్ప అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరో వ్యక్తి వంశీ తీవ్రంగా గాయపడడంతో అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

విత్తు వేసేద్దాం.. చకచకా..!





హ్యాండ్ పుష్ సీడర్ ద్వారా మొక్కజొన్న విత్తుతున్న రైతులు

రైతుల కోసం మార్కెట్లో ఆధునిక యంత్రాలు వస్తూనే ఉన్నాయి. పంటల సాగులో పెట్టుబడులతో తడిసిమొపెడవుతున్న రైతన్నకు యంత్రాలు కష్టాలు తీర్చే మంత్రంలా ఉపయోపడుతున్నాయి. ప్రస్తుతం మొక్కజొన్న సాగు చేయాలంటే కూలీలతో విత్తనాలను నాటించాల్సి ఉంటుంది. ఒక్కొక్కరికి రోజుకు రూ.300 కూలి ఇవ్వాలి. ఎకరానికి ఐదుగురు కూలీలు అవసరం అవుతారు. ఈ లెక్కన భారీగా ఖర్చవుతుంది. దీనికి ప్రత్యామ్నాయంగా మార్కెట్లోకి హ్యాండ్ పుష్ సీడర్ అనే నూతన యంత్రం వచ్చింది. యంత్రానికి ఉన్న పెట్టెలో విత్తనాలను పోసి పొలంలో తోసుకుంటూ వెళ్తుంటే నేలలో విత్తనాలు పడతాయి. ఇలా ఇద్దరు వ్యక్తులు కలిసి యంత్రం ద్వారా రోజుకు మూడెకరాల్లో మొక్కజొన్నను విత్తుతున్నారు. అదే కూలీలకు అయితే రూ.4,500 వరకు ఖర్చవుతుంది. యంత్రం ద్వారా నాటే వారికి ఒక్కొకరికి రూ.వెయ్యి కూలి ఇచ్చినా నష్టం లేదని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె పొలాల్లో కోవెలకుంట్ల మండలం భీమునిపాడు గ్రామానికి చెందిన రైతులు ఈ యంత్రం ద్వారా మొక్కజొన్నను నాటుతున్నారు. ఈ యంత్రాలను గుంటూరులో ఒకటి రూ.7 వేలు చొప్పున కొనుగోలు చేసినట్లు తెలిపారు. అటుగా వెళ్తున్న రైతులు, వాహనదారులు ఇదేదో బాగుందే అని ఆసక్తిగా యంత్రాల వివరాలు తెలుసుకొని వెళ్తున్నారు.

– దొర్నిపాడు

బాలికల రగ్బీ విజేత కర్నూలు

- బాలుర విభాగంలో రన్నరప్



కర్నూలు బాలికల జట్టుకు పతకాలు అందిస్తున్న అతిథులు

కమలాపురం: స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాలబాలికల రగ్బీ పోటీలు ఆదివారం ముగిశాయి. 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన బాలబాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహించారు. నాకౌట్ పద్ధతిలో సాగిన ఈ పోటీల్లో బాలికల విభాగంలో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో వైఎస్సార్ జిల్లా జట్టుపై గెలుపొందింది. బాలుర విభాగంలో ఫైనల్‌లో కర్నూలు జట్టుపై నెల్లూరు విజయం సాధించి విజేతగా నిలిచింది. విజేతలకు సూర్య ట్రాన్స్‌పోర్ట్ అధినేత సానేపల్లి ప్రసాద్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి, గేమ్స్ పరిశీలకుడు రమేశ్ బహుమతులను అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్, కిరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి బస్సును ఢీకొన్న లారీ



బోల్తాపడిన పెళ్లి బస్సు





గాయపడిన నారాయణ, మనోహర్

- 10 మందికి తీవ్ర, 35 మందికి స్వల్పంగా గాయాలు
- ప్రమాదం ధాటికి రోడ్డు పక్కన బోల్తాపడిన ట్రావెల్ బస్సు
- శనివారం అర్ధరాత్రి మార్కాపురం –కంభం హైవేపై ఘటన

మార్కాపురం రూరల్: ఆగి ఉన్న పెళ్లి బస్సును లారీ ఢీకొట్టడంతో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని మిట్టమీదిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ప్రమాదం చోటుచేసుకుంది. మార్కాపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం బిజినవేముల గ్రామానికి చెందిన పెళ్లి బృందం పల్నాడు జిల్లా నరసరావుపేటలో వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్నారు. ఈ క్రమంలో మార్కాపురం–కంభం మధ్య మిట్టమీదిపల్లి క్రాస్ రోడ్డు వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు బస్సును నిలిపారు. ఇదే సమయంలో మార్కాపురం నుంచి కంభం వైపు వేగంగా వెళ్తున్న ఐషర్ లారీ ఒక్కసారిగా ఢీకొట్టడంతో బస్సులో కూర్చొని ఉన్న 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 35 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మార్కాపురం జీజీహెచ్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు. ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చికిత్స అనంతరం మరో వాహనంలో స్వగ్రామానికి వెళ్లారు. గాయపడి చికిత్స పొందిన వారిలో మనోహర్, రాకేష్, రాజబాబు, వసంతరాయలు, హరిబాబు, గుణలక్ష్మి, జానకి, శివమ్మ, రాధాకృష్ణ, నారాయణ ఉన్నారు. మార్కాపురం రూరల్ ఎస్‌ఐ అంకమరావు కేసు విచారణ చేస్తున్నారు.

దాడికి పాల్పడిన నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న మూడవ పట్టణ పోలీసులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకులు ముస్తఫా ఆయన తమ్ముడిని కర్రలతో చావబాదిన ఘటనలో ఆదివారం మూడవ పట్టణ పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ నెల 5వ తేదీన బాధితుడు తన తమ్ముడితో కలిసి రామచంద్రమిషన్ రోడ్డు మీదుగా ఇంటికి వెళుతుండగా ఆటోలో వెంబడించిన దుండగులు ఢీకొట్టి కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరూ స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను బాధితుల నుంచి సేకరించి సాంకేతికంగా దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించిన పోలీసులు నగర సమీపంలోని అరుంధతీ నగర్‌కు వెళ్లే దారిలో టీవీ టవర్ వెనుకాల ఉన్నట్లు తెలుసుకున్నారు. మూడవ పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి తన సిబ్బందితో వెళ్లి దాడి ఘటనలో ఉపయోగించిన ఆటో ఏపీ 21 ఎక్స్ 8920ను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. అరెస్టు అయినా వారిలో కందుకూరి మహేష్‌బాబు (శ్రీరామనగర్), శెట్టి మంజునాథ్ (జూపాడు బంగ్లా), సి.భానుప్రకాష్ (జూపాడుబంగ్లా), నాగేంద్రబాబు (వెంకయపల్లె), నానిబాబు (వెంకయపల్లె) ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. దాడికి వ్యక్తిగత కక్షలు కారణమని పోలీసులు వెల్లడించారు.

కేసీ కాల్వలో యువకుడి గల్లంతు

కర్నూలు (టౌన్): ప్రమాదవశాత్తు కేసీ కెనాల్‌లో పడి ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఆదివారం స్వామిరెడ్డినగర్ సమీపంలో ఈ ఘటన జరిగింది. ఫొటోగ్రాఫర్ ఆంజనేయులు కుమారుడు దినేష్ మధ్యాహ్నం కేసీ కెనాల్ వైపు నడుచుకుంటూ వెళ్తూ పొరపాటున కాల్వలో పడ్డారు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇద్దరు అధ్యాపకులకు రాష్ట్రస్థాయి అవార్డులు



దండె స్వప్నశ్రీ



డాక్టర్ ఆరతి చక్ర

కర్నూలు సిటీ: డిగ్రీ కాలేజీల విభాగంలో ఇద్దరు అధ్యాపకులు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. క్లస్టర్ యూనివర్సిటీ అనుబంధ కాలేజీగా ఉన్న సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీకి చెందిన వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డా. దండె స్వప్నశ్రీ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీకి చెందిన గృహ విజ్ఞాన శాస్త్రం అధ్యాపకురాలు డాక్టర్ ఆరతి చక్రకు ఈ అవార్డు వరించింది. వీరు నేడు విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ అవార్డుకు ఎంపికైన వారిని ఆయా కాలేజీలకు చెందిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఆదివారం ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మల్లన్నను దర్శించుకున్న అఘోరీ



మల్లన్న దర్శనానికి వెళ్తున్న అఘోరీ

శ్రీశైలంటెంపుల్/ప్రాజెక్ట్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను అఘోరీ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం వస్త్రధారణతో ఆలయ ముఖద్వారం వద్దకు చేరుకున్న ఆమెకు ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, శ్రీశైలం సీఐ ప్రసాదరావు తమ సిబ్బందితో బందోబస్త్ ఏర్పాటు చేసి దర్శనానికి తీసుకువచ్చారు. శ్రీశైల మల్లికార్జున స్వామిని, భ్రమరాంబాదేవిని దర్శించుకుని తిరుగు పయనమయ్యారు. అంతకు ముందు ఆమె ఉదయం లింగాలగట్టు పాతాళగంగలో కార్తీకమాస పుణ్యస్నానం చేశారు. అనంతరం సున్నిపెంటలోని ఓ మహిళ ఇంటికి చేరుకుని అక్కడే భోజనం చేసి శ్రీశైలానికి వెళ్లారు.

రజకులకు పదవులు కేటాయించాలి



రజక పోరాటయోధుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్): రజకులను చిన్నచూపు చూడటం తగదని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడాల నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కిసాన్ ఘాట్‌లో రజక సంఘం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సంఘం నేతలు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకొని రజకులను రాజ్యాంగం వైపు నడిపించాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణాల వారితో సమానంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ పదవులతో పాటు నామినేటెడ్ పదవులు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. రజకుల హక్కుల సాధన కోసం పోరాడిన నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా సంఘం అధ్యక్షుడు గోల్డ్‌మెన్ శ్రీనివాసులు, నాయకులు నాగరాజు, మధు, లక్ష్మన్న, అంజి లాయర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

నంద్యాల: ఇంటర్ చదువుతున్న విద్యార్థి చంద్రశేఖర్ (18) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ సూర్యమౌళి ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన మేరకు.. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చంద్రశేఖర్ ఈనెల 8వ తేదీన పురుగు మందు తాగడంతో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి తండ్రి సుంకప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లాకు తృతీయ స్థానం



బహుమతి అందుకుంటున్న కర్నూలు జిల్లా బాలుర జట్టు

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి అండర్ –19 ఫుట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు జిల్లా, బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్లు ప్రతిభ చాటి విజేతలుగా నిలిచాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు, ప్రగతి జూనియర్ కళాశాల సత్తెనపల్లి ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్–19 ఫుట్‌బాల్ పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించారు. ఆదివారం ఫైనల్ పోటీలు జరిగాయి. బాలుర విభాగం ఫైనల్స్‌లో విశాఖ జట్టుపై గుంటూరు జట్టు పైచేయి సాధించింది. కర్నూలు జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో వైఎస్సార్ జిల్లా జట్టుపై అనంతపురం జట్టు గెలుపొంది విజేతగా నిలిచింది. గుంటూరు జిల్లాతృతీయ స్థానంలో నిలిచింది. విజేతలకు కప్పుతో పాటు రోలింగ్ షీల్డ్, నగదు బహుమతులను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అందజేశారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన విచారణ

- బోరుగడ్డ అనిల్‌ను రాజమండ్రి జైలుకు తరలించిన పోలీసులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు బోరుగడ్డ అనిల్‌కుమార్‌పై విచారణ ఆదివారం ముగిసింది. రెండు రోజులుగా ఆయన కర్నూలు మూడవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఉన్నాడు. 2022 సంవత్సరంలో అప్పట్లో కర్నూలుకు చెందిన ఐటీడీపీ సభ్యులు సోషల్ మీడియాలో టీడీపీ నేతలను అభ్యంతరకరంగా విమర్శలు చేస్తున్నారని బోరుగడ్డ అనిల్ కుమార్‌పై ఫిర్యాదు చేశారు. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు తాజాగా రెండు రోజుల క్రితం పీటీ వారెంటుతో రాజమండ్రి జైలులో రిమాండ్‌లో ఉన్న ఆయన్ను కర్నూలుకు తీసుకొచ్చి విచారించారు. విచారణ అనంతరం ఆయన్ను తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు మూడవ పట్టణ పోలీసులు వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

■ M.Sc Courses Available in Distance Botany, Zoology, Microbiology, Chemistry, Organic Chemistry, Psychology, Food & Nutrition, Mathematics, Statistics, Computer Science. Sri Vijayadurga Degree College, Kurnool. Ph: 9030628410, 9398122900 [L-796391]

WANTED

■ కర్నూలులో SHS వారి కోరుకొండ, కలికిరి సైనిక్ స్కూల్ కోచింగ్ సెంటర్‌లో బోధించుటకు ఇంగ్లీష్, సైన్స్, సోషియల్ టీచర్స్ కావలెను. సంప్ర: 9492944425. [L-796388]

■ ప్రముఖ టోల్‌ప్లాజా నందు పనికి 10th - PG అర్హత గల కంప్యూటర్ ఆపరేటర్ & క్యాషియర్ కావలెను. 8 గం॥ డ్యూటీ, భోజనం+వసతి. ఆకర్షణీయ జీతం. Loc: కర్నూలు. 6300574162. [NA-3012]

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th- డిగ్రీ, Sal: 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. Cont: 8073902428 [G-9065]

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ18k Ph: 9912011899, 9912011499 [SCA-24000548]

■ కష్టలెస్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995365999 [HA-98972]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ వింగ్
70750 09185
70750 09165
4 Lines Classified Rs. 300/-
For Extra Line Rs. 75/-
Classified Display Rs. 215/-